
ప్రజాశక్తి

బుధవారం 27 మార్చి 2024

5

పార్వతీపురం మన్యం



పిజియోథెరపీ క్రికెట్ లీగ్‌లో డాక్టర్ ప్రతిభ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విశాఖపట్నంలో గత మూడు రోజులుగా జరిగిన పిజియోథెరపిస్ట్ క్రికెట్ లీగ్‌లో విశాఖపట్నంలోని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న 50మంది పిజియోథెంపిస్టు వైద్యులు 5 టీంలుగా 15 మ్యాచ్‌లు ఆడిన లీగ్ పోటీల్లో ఆడి బ్లాక్ పేంథర్స్ టీం విజయం సాధించి కప్‌ను సొంతం చేసుకుంది. ఈ లీగ్ పోటీల్లో పార్వతీపురానికి చెందిన డాక్టర్ జీరు ఉమాకాంత్‌రెడ్డి ప్రతిభ కనబర్చి మ్యాన్ ఆఫ్ ద సిరీస్, ఉత్తమ బౌలర్ అవార్డు అందుకున్నారు. డాక్టర్ ఉమాకాంత్ రెడ్డి గతంలో జరిగిన అనేక లీగ్ మ్యాచ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి అనేక మంది ప్రశంసలు అందుకున్నారు. ఈ క్రికెట్ లీగ్‌కు కార్పొరేట్ ఆసుపత్రులు సహాయ సహకారాలు అందించారు.

బొత్సపై భయమెందుకో?

- ఎమ్మెల్యే అభ్యర్థిని తేల్చుకోలేకపోతున్న టిడిపి
- తెలుగు తమ్ముళ్లలో నైరాశ్యం



ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, వైసిపి సీనియర్ నేతపై పోటీకి టిడిపి భయపడుతుందా? అందుకే చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరనేది తేల్చుకోలేకపోతోందా? అంటే చాలా మంది నోట ఔననే సమాధానం వినిపిస్తోంది. కొంతమంది మాత్రం జిల్లాలో బొత్స ప్రభావాన్ని, హవాను కట్టడి చేసేందుకు టిడిపి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందని చెబుతున్నారు. కానీ, టిడిపి వ్యూహం వైసిపి దాహం తీర్చే విధంగా మారిపోతోంది. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున దాదాపు పదేళ్లగా స్థానిక టిడిపి కేడర్‌తో మమేకమై పనిచేస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో టిడిపిలో మరెవ్వరూ లేనంతగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు. లోకేష్ నిర్వహించిన యువగళం సభకు కూడా నాగార్జున నాయకత్వంలో జనం భారీగానే తరలి వచ్చారు. ఈనేపథ్యంలో చీపురుపల్లి సీటు నాగార్జునకే అన్న చర్చసర్వత్రా సాగింది. అనూహ్యంగా నాగార్జునతోపాటు ఆయన పెదనాన్న, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు, మాజీ ఎమ్మెల్యే మీసాల గీత అభ్యర్థిత్వంపై ఐవిఆర్‌ఎస్ సర్వే చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో, నాగార్జున, ఆయన అభిమానులు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. దీనిపై ఎలాంటి క్లారిటీ ఇవ్వకుండానే మరో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పేరును పరిశీలనలో ఉంచడం చర్చనీయాంశంగా మారింది. ఇంతమంది పేర్లు పరిశీలనలో వున్నప్పటికీ ఎటూ తేల్చలేకపోతోంది. మరోవైపు ఎన్నికల షెడ్యూల్ వెలువడి, పోలింగ్ తేదీ ఖరారు కావడం, మరోవైపు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోకజవర్గాల్లోనూ ప్రచారం హోరెత్తు తుండడం, చివరికి చీపురుపల్లిలోనూ వైసిపి తరపు ప్రచారం ఊపందుకోవడంతో ఈ నియోజకవర్గంలో నా అనుకునే నాయకుడు లేక తెలుగు తమ్ముళ్లు నైర్యాశ్యంలోకి వెళ్లారు. ఇప్పటికీ నాగార్జున నియోజకవర్గంలో సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ అభ్యర్థిత్వం ఖారారు కాక అభిమానులు అయోమయంలో ఉన్నారు. కేడర్‌లో పట్టుదల సడలుతోందని మండల, నియోజకవర్గ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా కొద్ది రోజులుగా బొత్స తన ప్రచార పర్వానికి పదును పెట్టారు. నియోజకవర్గంలో దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఒక దఫా ప్రచారాన్ని పూర్తిచేశారు.

వాస్తవానికి చీపురుపల్లి రాజకీయ ముఖచిత్రాన్ని ఒక్కసారి పరిశీలిస్తే నేటి వైసిపి, నాటి కాంగ్రెస్ కన్నా టిడిపి అభ్యర్థులే ఎక్కువసార్లు గెలుపొందారు. గత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి కిమిడి నాగార్జునపై వైసిపి తరపున పోటీ చేసిన బొత్స సత్యనారాయణ విజయం సాధించినప్పటికీ, అంతకు ముందు 2014లో నాగార్జున తల్లి మృణాళినిపై పోటీచేసి ఓటమి చెందారు. ఈ మాటకొస్తే మృణాళిని ఈ నియోజకవర్గంలో కూడా లేరు. అంతకు ముందు 2004, 2009 ఎన్నికల్లో వరుసాగా రెండుసార్లు టిడిపి అభ్యర్థి గద్దె బాబూరావుపై బొత్స విజయం సాధించినప్పటికీ, 1983లో టిడిపి ఆవిర్భావం నుంచి వరుసగా ఐదు సార్లు టిడిపియే విజయం సాధించింది. ఈ విధంగా పరిశీలించినప్పుడు టిడిపి ఆవిర్భావం తరువాత జరిగిన 9 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒకసారి వైసిపి, రెండు సార్లు కాంగ్రెస్ గెలిచాయి. మిగిలిన ఆరుఎన్నికల్లో టిడిపి హవా కొనసాగింది. పోనీ, ఇక్కడ బొత్సకి ఓటమి లేదా అంటే ఒకసారి నాగార్జున తల్లే ఓడించారు. ఇలా టిడిపికి కంచుకోటలా ఉన్న చీపురుపల్లిలో నేడు అభ్యర్థిని ఖరారు చేసేందుకు సాహశించ లేకపోవడంతో నియోకవర్గంలోని టిడిపి అభిమానులను కలవరపాటుకు గురిచేస్తోందని సాక్షాత్తు ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. ఇంకా వ్యూహం పేరుతో అభ్యర్థి ప్రకటన తేల్చకపోతే పనిగట్టుకుని వైసిపికి అప్పగించినట్టేనంటూ పలువురు విశ్లేసిస్తున్నారు.

సిఎఎను రద్దు చేయాలి

- మత ప్రాతిపదికన పౌరసత్వం రాజ్యాంగ వ్యతిరేకం
- సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి
- వామపక్ష, లౌకిక పార్టీల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



పట్టణంలో వామపక్ష, లౌకిక పార్టీల నాయకులు నిర్వహిస్తున్న కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

దేశాన్ని బలహీనపరిచే సిఎఎ చట్టం అమలును రద్దు చేయాలని, బిజెపి మోడీ విధానాలకు మద్దతు తెలిపే వైసిపి, టిడిపి జనసేన పార్టీలను వ్యతిరేకించాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎం. కృష్ణమూర్తి అన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన సిఎఎ మతోన్మాదపు చట్టాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం స్థానిక చర్చి జంక్షన్ నుండి కాంప్లెక్స్ మెయిన్ రోడ్డు మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ, సిపిఐ న్యూ డెమోక్రసీ, కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. నాటి బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ముందు మోకరిల్లి క్షమా భిక్షకు మొరపెట్టుకున్న బిజెపి దేశభక్తులు నేడు దేశభక్తి కోసం మాట్లాడుతుండడం సిగ్గుమాలిన చర్యని విమర్శించారు. పౌరసత్వ చట్టం రాజ్యాంగ స్పూర్తికి విరుద్ధమైనదని, ఈ చట్టం దేశంలోని ముస్లింల సమస్య కాదని, పౌరులందరి సమస్య అని తెలిపారు. ఇది దేశ ఐక్యతకు, లౌకిక, ప్రజాస్వామ్యానికి ముంచుకొస్తున్న ప్రమాదానికి పేర్కొన్నారు. అన్ని మతాలు, జాతులు కలిసి పోరాడి స్వాతంత్ర్యం సాధించుకున్నాయని, ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి కలిసి దేశ లౌకిక స్వభావాన్ని నాశనం చేసి నిరంకుశ హిందూ మత రాజ్యంగా మార్చడానికి చేస్తున్న ప్రయత్నంలో భాగమేనని అన్నారు. ఇంత దుష్ట పన్నాగం పన్ని దేశ రాజ్యాంగాన్ని బలహీనపరిచే సిఎఎ చట్టం అమలును అడ్డుకోవాల్సిన వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు రాష్ట్రంలో బిజెపి వద్ద మోకరిల్లాయని అన్నారు. ఇది రాష్ట్ర దౌర్భాగ్య పరిస్థితి అని మండిపడ్డారు. మత ప్రాతిపదికన పౌరసత్వం అంటే ప్రపంచవ్యాప్తంగా, అమెరికాలో ఉన్న మన దేశపౌరులకు ప్రమాదం వస్తుందని నాయకులు తెలిపారు. అందుకు ఈ చట్టాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత దేశ పౌరులైన మన అందరి పైనా ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మధరావు, దుర్గరావు, కుమార్, కాంగ్రెస్ నాయకులు ఎం.సింహాచలం, సిపిఐ న్యూ డెమోక్రసి నాయకులు నర్సింగరావు, రమణి, సిపిఐ లిబరేషన్ నాయకులు పి. సంఘం, సిపిఎం నాయకులు వై.మన్మధరావు, వి. ఇందిరా, జి.వెంకటరమణ, రెడ్డి ఈశ్వరరావు, రెడ్డి లక్ష్మునాయుడు, బి.సూరిబాబు, గవర వెంకటరమణ, పి.రాజశేఖర్, డి.పండు పాల్గొన్నారు.



ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న కృష్ణమూర్తి

పేదలకు అండగా ఉండే సిపిఎంను గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రమణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజనులు, దళితులు రైతులు, వృత్తిదారుల పక్షాన, ప్రజల హక్కుల కోసం ఉద్యమాలు, పోరాటాలు చేసే సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థిని రానున్న ఎన్నికల్లో గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోలక అవినాష్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని గొరడలోని గిరిజనులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులకు ఓటేసి చట్టసభలకు పంపించాలని కోరారు. గిరిజనులకు కష్టం, నష్టం వచ్చినా అండగా నిలబడే పార్టీ ఒకే ఒక్క సిపిఎం పార్టీ అని అన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ మాట్లాడుతూ రాష్ట్రానికి దేశానికి ద్రోహం చేసి బాండ్లు పేరుతో ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసిన బిజెపిని, రాష్ట్రంలో దాన్ని బలపరుస్తున్న టిడిపి, జనసేన వైసిపిలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఎర్రజెండా నీడలోనే గిరిజనులకు రక్షణ ఉంటుందన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ స్వార్ధ రాజకీయాల కోసం నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థిని గెలిపిస్తే గిరిజనుల హక్కులు, చట్టాలను కాపాడుకోవచ్చుని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు, కె.గంగునాయుడు తదితరులు మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిసిసి డిఎం మహేంద్రకుమార్

సక్రమంగా విధులు నిర్వహించాలి : జిసిసి డిఎం

ప్రజాశక్తి - సాలూరు

జిసిసి సేల్స్ మాన్‌లు, కాంట్రాక్టు సేల్స్ మాన్‌లు, డీలర్లు, స్వయం సహాయక సంఘాల గ్రూపులు విధులు సక్రమంగా నిర్వహించాలని గిరిజన సహకార సంస్థ పార్వతీపురం డివిజనల్ మేనేజర్ మహేంద్ర కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సాలూరు, పాచిపెంట, మక్కువ, మెంటాడ, రామభద్రపురం మండలాలకు చెందిన సేల్స్ మాన్లు, డీలర్లు హాజరైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిసిసి డిపోల్లో విధిగా సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎండియు ఆపరేటర్ల ద్వారా రేషన్ సరుకులు లబ్దిదారులకు అందేలా చూడాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు గిరిజనులకు తెలియజేయాలని, నిర్దేశించిన లక్ష్యాల మేరకు కొనుగోలు చేయాలని ఆదేశించారు. బ్రాంచి పరిధిలో 8.12 కోట్ల రూపాయల లక్ష్యం కాగా రూ.7.16 కోట్ల మేరకు సాధించినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో రూ.60కోట్లు మేరకు లక్ష్యం సాధించామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా సిబ్బంది విధులు నిర్వహించాలని కోరారు. ఎప్పటికప్పుడు సరుకుల విక్రయాలు, కొనుగోళ్లకు సంబంధించి రికార్డులు దగ్గర వుంచుకోవాలని మహేంద్రకుమార్ సూచించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ జె.రామారావు, అకౌంటెంట్ గొంతెమ్మ పాల్గొన్నారు.

అనుమతుల కోసం 48 గంటల ముందు

సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, పక్కన ఎస్‌పి, జెసి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎన్నికల అనుమతులకు సువిధ ఆన్లైన్ యాప్‌లో కనీసం 48 గంటల ముందుగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి అంశానికి సంబంధించి అనుమతులు విధిగా పొందాలన్నారు. అనుమతులను ఆన్లైన్ సువిధ యాప్ ద్వారా తీసుకోవాలని, ఇందుకు కనీసం 48 గంటల ముందుగా దరఖాస్తు చేసుకుంటేనే అనుమతులు లభిస్తాయని స్పష్టం చేశారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించుటకు అన్ని చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు.

161 ఫిర్యాదులు అందాయి

జిల్లాలో ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు 161 ఫిర్యాదులు అందాయని కలెక్టర్ తెలిపారు. వీటిలో 20 సివిజన్ సంబంధించిన ఫిర్యాదులు, 1950 టోల్ ఫ్రీ నంబరుకు అందినవి 15, మీడియా ద్వారా అందినవి 39, వివిధ అంశాలకు సంబంధించి ఎన్నికల ఫిర్యాదు పోర్టల్‌లో 71 ఫిర్యాదులు, ఇతర పిర్యాదులు 16 ఉన్నాయని వివరించారు. సి విజిల్ ఫిర్యాదుల్లో 12 ఎన్నికలకు సంబంధించినవి కావని చెప్పారు. సి.విజిల్‌లో వచ్చిన ఫిర్యాదులను సరాసరి 38 నిమిషాల 42 సెకండ్లలో పరిష్కరించామనితెలిపారు. మీడియా ద్వారా అందిన ఒక ఫిర్యాదు విచారణలో ఉందన్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో ఎన్నికల ప్రవర్తనాన్ని నియమావళి ఉల్లంఘున కింద ఒక ఎఫ్ఐఆర్ నమోదయింధైందన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో భాగంగా జిల్లాలో ప్రభుత్వ స్థలాల్లో గల 15,560 వివిధ బ్యానర్లు, పోస్టర్లు తదితర సామగ్రిని తొలగించారని, ప్రైవేటు ప్రదేశాల్లో 8601 సామాగ్రిని తొలగించామని చెప్పారు. ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా పనిచేసిన 13మంది వాలంటీర్లను, ఒక కాంట్రాక్టు ఉద్యోగిని, ఒక రెగ్యులర్ ఉపాధ్యాయుడిపై చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో 7134 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని దీనివల్ల విలువ రూ.28.84 లక్షలుగా ఉందని చెప్పారు. పార్వతీపురం, కొమరాడ పోలీసులు ఒడిస్సా పోలీసులతో కలిసి సంయుక్త దాడులు నిర్వహించగా, అందులో పులిసిన బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారని ఆయన వెల్లడించారు .

10 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు

జిల్లాలో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో - ములిగూడ, బత్తిలి, భామిని, పి కోనవలస, కోనేరు కూడళ్లలో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారు. ఇవి ఇప్పటికే పనిచేస్తున్నాయని, వీటన్నిటిలో వెబ్ కాస్టింగ్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మరో ఐదు చెక్ పోస్టులు - గుణుపూర్, పద్మాపూర్, దండిగాం, ఆర్ కె బట్టివలస, అడారు వద్ద ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో సహాయ కేంద్రాలు

రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారని చెప్పారు. జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో కంట్రోల్ రూం (సహాయక కేంద్రం) ఫోన్ నంబర్లు : 08963-796126, 08963-293046, సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ కార్యాలయం 8977519101 ఏర్పాటు చేశామని ప్రజలు వినియోగించు కోవాలని చెప్పారు.

ముద్రణ కర్తలు వివరాలు ప్రచురించాలి

కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లు తదితర సామాగ్రిని ముద్రించే వారు విధిగా వారి చిరునామా, ముద్రించిన ప్రతులు సంఖ్య ప్రచురించాలని ఆయన చెప్పారు.

85 ఏళ్లుదాటిన వారికి దరఖాస్తు ద్వారా ఓటు

85 ఏళ్ల వయస్సు దాటిన వారికి, దివ్యాంగులకు బిఎల్ఓ ద్వారా దరఖాస్తు అందజేస్తామని, తద్వారా ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకు నిర్వర్తించుటకు అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు.

షెడ్యూలు ప్రకటించాకే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

ప్రవర్తనా నియమావళి అమలుకు ముందు పంపిణీ చేసిన లబ్ధిదారుల కార్డులు, నిర్మాణ శిలాఫలకాలు తదితర అంశాలలో ఉన్న ఫొటోలకు, పేర్లకు సంబంధించి ఎటువంటి జోక్యం అవసరం లేదని ఎన్నికల ప్రవర్తనా నియమావళి స్పష్టంగా తెలియజేసిందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన తర్వాత నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలవుతుందన్నారు. షెడ్యూలు ప్రకటించిన తేదీకి ముందు ఉన్న భవనాల రంగులు, శిలాఫలకాలు తదితర వాటిపై ఉన్న ముఖ్యమంత్రులు, మంత్రులు, ఫొటోలు, పేర్లపై ఎటువంటి జోక్యం అవసరం లేదని ఎన్నికల నిబంధనలు స్పష్టంగా పేర్కొన్నాయని వివరించారు.

ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత ఎన్నికలకు భద్రతాపరమైన అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే జిల్లాకు మూడు కంపెనీల సిఆర్‌పిఎఫ్ దళాలు వచ్చాయని, జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ప్రతిరోజు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తూ ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపుతామని తెలిపారు. ప్రస్తుతం రెండు సమీకృత చెక్పోస్టులుగా పనిచేస్తున్నాయని, అదనంగా మరో మూడు చెక్పోస్టులను సమీకృత చెక్పోస్టులుగా మార్చేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించి ప్రశాంతంగా, సజావుగా జరిపేందుకు సహకరించాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, డిఆర్ఒ జి.కేశవనాయుడు పాల్గొన్నారు.

18న నోటిఫికేషన్

ఎన్నికల నోటికేషన్ ఏప్రిల్ 18న విడుదలవుతుందని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఏప్రిల్ 25 వరకు నామినేషన్లు స్వీకరణ జరుగుతుందని, 26న నామినేషన్ల పరిశీలన ఉంటుందని ఆయన తెలిపారు. ఈనెల 29 వరకు ఉపసంహరణలు ఉంటాయని, మే 13న పోలింగ్, జూన్ 4న లెక్కింపు ఉంటాయని చెప్పారు. జిల్లాలో 48 ఫ్లయింగ్ స్క్వాడ్ లు, 36 ఎస్ఎస్‌టి బృందాలు, 16 విఎస్‌టి బృందాలు ఉంటాయని చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, పాలకొండ, కురుపాం, పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ, సాలురులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ ఏర్పాటు చేశామని తెలిపారు. నాలుగు నియోజక వర్గాల లెక్కింపు కేంద్రం పార్వతీపురం ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేశామన్నారు. అరకు పార్లమెంటు రిటర్నింగ్ అధికారిగా తనను నియమించారని చెప్పారు. అరకు పార్లమెంటు లెక్కింపు ఆయా నియోజక వర్గాల్లో ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రాల్లో జరుగుతుందని చెప్పారు. జిల్లాలో 144 సెక్టార్లు, 151 రూట్‌లు ఏర్పాటు చేశామని, ఇవిఎంలు సరిపడినన్ని ఉన్నాయని, ఏప్రిల్ 12న మొదటి రాండమైజేషన్, మే 1న రెండో రాండమైజేషన్ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

కొటియా గ్రామాల్లో చారిత్రక సాంప్రదాయాన్ని పాటిస్తాం

కొటియా గ్రామాల్లో చారిత్రకంగా వస్తున్న సాంప్రదాయాన్ని పాటిస్తామని కలెక్టర్ చెప్పారు. సరిహద్దు జిల్లాలైన రాయగడ, కోరాపుట్ జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశామని, అందులో అన్ని విషయాలు చర్చించి పరస్పర సహకారం అందించుకోవడంలో అంగీకారం కుదిరిందని తెలిపారు. ఇరువైపులా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు జరుగుతుందని, ఆ ప్రాంత ప్రజలు తమ ఇచ్చానుసారం ఎక్కడైనా ఓటు వేయవచ్చని చెప్పారు. ఇందుకు రెండు జిల్లాల యంత్రాంగం ఎటువంటి అడ్డంకులు సృష్టించడం గానీ, ఆటంకాలు కల్పించడం కానీ జరగదని అంగీకరించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. చారిత్రక సాంప్రదాయంగా వస్తుందని, దానిని పాటిస్తామని అన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రానున్న వేసవి మూడునెలల్లో తాగునీటి సరఫరాకు కావలసిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరు కార్యాలయం నుండి నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమి షనర్లు, మండల అభివద్ధి అధికారులు, మండల ఇంజనీరింగు అధికారులతో మంచినీటి సరఫరాపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ ప్రజలకు మంచినీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. మంచినీటి పథకాలు, సోలార్ నీటి సరఫరా పథకాలు, బోరుబావులకు అవసరమైన వాటికి మరమ్మతులు చేయించాలని తెలిపారు. మరమ్మతులు పనులను ఈనెల 31 నాటికి పూర్తిచేయాలని తెలిపారు. రానున్న మూడు నెలలు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంటుందని, దీన్ని అధిగమించేందుకు కలెక్షను బావుల వద్ద రీఛార్జి చేసేందుకు నీటి నిల్వ కట్టడాలు సరిగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామంలో నీటి నమూనాలు తీసుకోవా లని, నీటి నాణ్యతను పరీక్షించాలని తెలిపారు. ఎంపిడిఒలు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో మంచినీటి పథకాల నిర్వహణకు 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలన్నారు. ప్రజలు ఎక్కువగా భూగర్భ జలాలపై ఆధారపడుతున్నారని, భూగర్భ జలాలను విపరీతంగా వాడుతున్నారని, భవిష్యత్తులో భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భూగర్భ జలాలు పెంచేందుకు కాంటూరు కందకాలు, వాటర్ షెడ్ వంటి పథకాలు నరేగా ద్వారా చేపట్టాలని తెలిపారు. బెంగుళూరు, చెన్నై వంటి నగరాలు ప్రస్తుతం నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయని, అక్కడ నీటిని వృథా చేస్తే అధికారులు అపరాదురుసుం విధిస్తున్నారని, అంటువంటి పరిస్థితి భవిష్యత్తులో గ్రామీణప్రాంతాల్లో ఏర్పడే అవకాశం ఉందని, కావున భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టడం, నీటిని పొదుపును పాటించడం ద్వారా భవిష్యత్తు విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారులు ఐటిడిఎ పిఒలు సి.విష్ణుచరణ్, కల్పనాకుమారి, ఆర్‌డిఒలు కె.హేమ లత, ఎవి రమణ, నియోజకవర్గ స్థాయిలో మంచినీటి సరఫరాకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డిపిఒ బి.సత్యనారాయణ, నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

జిసిసి కొనుగోలు లేక చింతపండు అక్రమ రవాణా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి ఏటా గిరిజనుల జీవనాధారమైన చింతపండు పంట. అయితే గిరిజనులు పండించిన చింతపండును గిరిజన సహకార సంస్థ అధికారులు కొనుగోలు చేయడం లేదు. దీంతో ఇదే అదునుగా బయట ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి గిరిజనుల వద్ద తక్కువ ధరకే చింతపండు కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నారని సిపిఎం జిల్లా నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ విమర్శించారు. మంగళవారం గొరడ, దుడ్డుఖల్లు ప్రాంతాల్లో వ్యాపారులు, గిరిజనుల వద్ద చింతపండు కొనుగోలు చేసి మోటార్ సైకిల్‌తో తరలించడం కనిపించింది. పండించిన చింతపండును జిసిసి అధికారులు కొనుగోలు చేసేందుకు రాకపోవడంతో పంట నిల్వ ఉంచుకోలేక, ఏం చేసేది లేక చివరికి ప్రతి ఏటా దళారులకు, వ్యాపారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి. ఇప్పటికైనా జిసిసి అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల ద్వారా చింతపండు కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించాలని సిపిఎం నాయకులు కోరుతున్నారు.



ఏజెన్సీ నుంచి తరలిపోతున్న చింతపండు

లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించిన ఆర్ఓ


సమావేశంలో మాట్లాడుతున్న గంగునాయుడు

ఉపాధి హామీ బిల్లులు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో గిరిజనులు, పేదలు ఉపాధి లేక ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు వలసలు వెళ్లి పెసర, మినప మొక్కలు తీసే పనులకు వెళ్లి పోతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉపాధి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. పాచిపెంట నుండి భామిని వరకు 5 వారాల నుంచి 8 వారాలు వరకు ఉపాధి బిల్లుల బకాయిలు ఉన్నాయన్నారు. గతంలో ఉపాధి బిల్లులు చెల్లించాలని సంబంధిత మండల కార్యాలయాల్లో ధర్నాలు చేసి నిరసన వ్యక్తం చేశామన్నారు. ఇప్పటికైనా కలక్టర్ స్పందించి ఉపాధి బకాయిలు తక్షణమే విడుదల చేసి, కూలీల ఆకలి బాధలు తీర్చాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి.మోహన్‌రావు, కూలీలు పాల్గొన్నారు.

30న వీరఘట్టంలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టం 4వ సచివాలయ పరిధిలో ఈ నెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపిడీవో ఎంవిబి సుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వైద్య సిబ్బందితో పాటు సచివాలయ సిబ్బంది సమయం పాటించి విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

గిరిజన గ్రామాల్లో ఎంసిసి పర్యటన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గదభవలస పంచాయతీ పరిధిలోని నీలంపేట, శాంతిగూడ, ఏలీషాపురం తదితర గిరిజన గ్రామాల్లో ఎంపిడిఒ, ఎంసిసి అధికారి ఎంవిబి సుబ్రహ్మణ్యం మంగళవారం పర్యటించారు. గ్రామాల్లో ఎక్కడైనా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన స్టిక్కర్లు, బ్యానర్లు ఉన్నదీ, లేనిదీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయనతో పాటు ఎంసిసి బృందం ఉంది.


వికలాంగ విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

వికలాంగ విద్యార్థులకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో గల భవిత కేంద్రం ఆవరణలో మంగళవారం విద్య సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వికలాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి నిపుణులైన వైద్యులు ఆశ, ప్రశాంత్ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేశారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాలకు చెందిన పలువురు వికలాంగులను తమ తల్లిదండ్రులు తీసుకొచ్చి వైద్య పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పి. భానుమూర్తి, ఎంఇఒ రాధాకృష్ణ, వైద్య, విద్య సిబ్బంది పాల్గొన్నారు.


గరుగుబిల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని రావివలస, లక్ష్మీపురం గ్రామాల్లో మంగళవారం స్థానిక ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీస్ కవాతు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ అమ్మన్న రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు పోలీసు కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అదే విధంగా సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పలు విభాగాలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.



ఇవిఎం ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్

ఇవిఎం ఓటింగ్ పై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణలో భాగంగా ఉపాధ్యాయులకు ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ ఇ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని, ముందస్తు గా గ్రామాల్లో ఇప్పటికే మొబైల్ టీమ్ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్క కీ బోర్డు ఓటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, ఎంఇఒలు జి.సూర్యదేముడు,ఎంవి రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఇవిఎంల వినియోగంపై శిక్షణ

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్


ఇవిఎంల వినియోగం , మాక్ పోలింగ్ నిర్వహణ పై మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ సమావేశ భవనంలో ప్రిసైడింగ్ అధికారులకు వర్క్ షాపు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం తహశీల్దార్ కె.ఆనందరావు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వాటి వినియోగంపై అవగాహన కల్పించారు.

ప్రజాశక్తి - సాలూరు

అసెంబ్లీ ఓట్ల లెక్కింపు కేంద్రం, స్ట్రాంగ్ రూంలను పార్వతీపురం ఐటిడిఎ పిఒ, సాలూరు రిటర్నింగ్ అధికారి సి.విష్ణుచరణ్ మంగళవారం పరిశీలించారు. లెక్కింపు కేంద్రాన్ని పార్వతీపురం ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేస్తున్నామని, స్ట్రాంగ్ రూంను సాలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. లెక్కింపు కేంద్రం, స్ట్రాంగ్ రూంలో అన్ని పక్కాగా ఉండాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఇవిఎం స్ట్రాంగ్ రూం ఏర్పాటు, ఎన్నికల సామగ్రి పంపిణీ చేపట్టామని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా నిర్వహణకు అంతా సహకరించాలని ఆయన కోరారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, రాజకీయ పార్టీలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎన్నికల అనుమతులకు సువిధ ఆన్లైన్ యాప్‌లో కనీసం 48 గంటల ముందుగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ప్రచారం తదితర ప్రతి అంశానికి సంబంధించి అనుమతులు విధిగా పొందాలన్నారు. అనుమతులను ఆన్లైన్ సువిధ యాప్ ద్వారా తీసుకోవాలని, ఇందుకు కనీసం 48 గంటల ముందుగా దరఖాస్తు చేసుకుంటేనే అనుమతులు లభిస్తాయని స్పష్టం చేశారు. ఎన్నికల డిజిటల్ మీడియా విధానంలో ప్రచారానికి విధిగా అనుమతులు పొందాలని చెప్పారు. కరపత్రాలు, పోస్టర్లు, బుక్ లెట్లు తదితర ప్రచార సామగ్రిలో ముద్రణ, ప్రచురణ కర్తలు వివరాలు, ముద్రించిన ప్రతుల సంఖ్య విధిగా తెలియజేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి విధిగా పాటించాలని, వ్యక్తిగత దూషణలు, కుల, మత, ప్రాంతీయతత్వాలు రెచ్చగొట్టేలా ఉండరాదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సింహాచలం పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ ఓటింగ్ పై అవగానే సీతానగరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణలో భాగంగా ఉపాధ్యాయులకు ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా తాసిల్దార్ ఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓటింగ్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని ముందస్తు గ్రామాల్లో ఇప్పటికే అవగాహన కలిగించడానికి జరుగుతుందని మొబైల్ టీమ్ ద్వారా జరుగుతుందని అన్నారు ప్రతి ఒక్క కీ బోర్డు ఓటింగ్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు జి సూర్యదేముడు ఎంవి రమణ ఎంపీడీవో ఎం ఈశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్వతీపురం :స్థానిక ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రంను జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక మంగళ వారం సందర్శించారు. లెక్కింపు కేంద్రంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నాలుగు నియోజక వర్గాల లెక్కింపు, పార్లమెంటరీ నియోజకవర్గ లెక్కింపు ఉంటాయని


బలిజిపేట : ఎన్నికల నిబంధనలను సిబ్బందికి వివరిస్తున్న ఆర్‌డిఒ హేమలత


కౌంటింగ్ ఏర్పాట్లు సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న జెసి శోబిక

అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మీడియా సెంటర్, బందోబస్తు, సిసి కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ డిఆర్ఒ జి.కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్స్ లేని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

సీతంపేట : పాలకొండ నియోజకవర్గంలో సిగ్నల్స్ లేని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్ సమాచారం నిమిత్తం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి కల్పనా కుమారి అన్నారు. మంగళవారం సీతంపేట మండలం సిగ్నల్స్ లేని పలు పోలింగ్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారి పరిశీలించారు. దాసుగుమడ, పెద్దతంకిడి, గుజ్జి, పెద్ద పల్లంకి, చిన్న పల్లంకి, బర్న పోలింగ్ కేంద్రాల్లో నెట్ వర్క్ పరిస్థితిని పరిశీలించి, ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. అదే విధంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సీతంపేట తహశీల్దార్ మహేశ్వరరావు, ఆర్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలిలి

బలిజిపేట :ఎన్నికల విధుల్లో సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం ఆర్‌డిఒ కె.హేమలత అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఎన్నికల సిబ్బందికి అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీవో సందర్శించారు. ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులు నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. శిక్షణలో ఇవిఎంలు వినియోగించే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జనార్దన్, ఎంఇఒలు సామల సింహాచలం, కె శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనీలు ఎం.పైడపు నాయుడు, గుల్ల రామారావు ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు ముందస్తు అనుమతులు తీసుకోవాలి

కురుపాం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాలకు, వాహనాలు, మైక్ సెట్, ర్యాలీ,సమావేశాలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కురుపాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వివి రమణ సూచించారు. మంగళవారం ఆయన ఎన్నికల సంఘం నిబంధనలు ప్రకటించారు .సువిధ ఆన్లైన్ ఏప్ ద్వారా పూర్తి సమాచారంతో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పార్టీ కార్యాలయాలు ఏర్పాటు, మైక్ సెట్, వీడియో వ్యాన్, ర్యాలీ నిర్వహించే మార్గం, ఎంతమంది హాజరౌతారు , క్యాంపెయిన్ నిర్వహణకు అవసరమైన అనుమతి, కరపత్రాలు ముద్రించి, పంపిణీ, పోస్టర్ల ముద్రణ , వాహనాలు కు మైక్ సెట్ ఏర్పాటు కు , జనరల్ ఏజెంట్ కి వాహనం అనుమతి ముందు గా తీసుకుని అనుమతి పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.

అటవీశాఖ అధికారుల తీరుపై ఎపిఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పోడు భూముల్లో వ్యవసాయం చేసుకునే గిరిజనుల పట్ల అటవీ శాఖ అధికారులు తీరు దారుణంగా ఉందని, వారిపై చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ ఎపిఒకు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. ఫిర్యాదు అనంతరం స్థానిక ఐటిడిఎ కార్యాలయ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ కొమరాడ మండలం పెద్దశాఖ పంచాయతీ దర్శింగికి చెందిన గిరిజనులు ఎంత పోడు భూమి సాగు చేస్తే అంత భూమికి పట్టాలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ గ్రామానికి చెందిన హెచ్.చిన్నయ్య, కిల్లక శంకర్రావు, కె.మంగులు, కె.కామేశ్వరరావు, కె.తానుబాబు తదితర గిరిజనులు తమ పోడు భూమిని సాగు చేస్తుకుంటే సోమవారం వారి పనిముట్లును అటవీశాఖ అధికారులు లాక్కోవడం దారుణమని, దీనిపై ఐటిడిఎ పిఒ చర్యలు తీసుకొని వారి సామగ్రి వెంటనే గిరిజనులకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి ఎపిఒ స్పందిస్తూ దర్యాప్తు చేపట్టి సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. వినతిని అందజేసిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, గిరిజన



ఎపిఒకు వినతిని అందజేసిన అనంతరం మాట్లాడుతున్న రెడ్డి వేణు

సంఘం నాయకులు శంకర్రావు, సూరయ్య, కామేశ్వరరావు చిన్నయ్య, మంగులు, వెంకట్రావు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ఏజెన్సీ ప్రాంతమైన నీలకంఠపురం గ్రామపంచాయతీ పరిధిలో గల పలు గ్రామాలో టిడిపి అభ్యర్థి తోయక జగదీశ్వరి ఎన్నికల ప్రచారం మంగళవారం చేపట్టారు. బాబు సూపర్ సిక్స్ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ సుకేష్, నాయకులు వెంపటాపు భారతి, రంజిత్ కుమార్ నాయకో, శంకర్, ప్రదీప్, లోవరాజు, పలువురు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామ పంచాయతీ పెద్దలు, అభిమానులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : రాబోయే టిడిపి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలోని ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందనున్నారని పార్వతీపురం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని పెద్దబొండపల్లిలో మంగళవారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులతో కలిసి నిర్వహించారు. టిడిపి-జనసేన, బిజెపి కార్యకర్తలు నాయకులు, ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు సూపర్ సిక్స్ మేనిఫెస్టోలో అంశాలను ప్రజానీకానికి వివరిస్తు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి


పార్వతీపురం : పెద్దబొండపల్లిలో ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి విజయచంద్ర

జనసేన, బిజెపి నాయకులు గాంధీ బోను చంద్రమౌళి గురజాన చంద్రమౌళి డొంకాడ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి సాగుపై శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

కొబ్బరి డెవలప్‌మెంట్ బోర్డు విజయవాడ ఆధ్వర్యాన స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. కొబ్బరి చెట్టులో వాడే యాంత్రీకరణ, సాగు యాజమాన్యం, బీమా తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఇందులో సుమారు 20మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీనివాసరాజు, కెవికె సిబ్బంది రఘు, శ్రీనివాసరావు, ట్రైనీలు పాల్గొన్నారు.

దుడ్డుఖల్లులో కాంగ్రెస్ ప్రచారం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మక సింహాచలం పంచాయతీ గ్రామాల్లో ఉన్న ఇంటింటికి వెళ్లి ఇందిరమ్మ అభయం, ఐదు న్యాయాలు, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గిరిజనులకు వివరించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దుడ్డుఖల్లు సర్పంచ్ నీలావతి, కురుపాం మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మక వెంకట్రావు, మన్యం జిల్లా ఆదివాసీ విభాగం అధ్యక్షులు రాఘవేంద్రరావు, నాయకులు బి.సూర్యం, కిల్లక ఫకీరు, నిమ్మక కృష్ణారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దుడ్డుఖల్లులో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎన్నికల నియమావళి పాటించాలి

ప్రజాశక్తి- బలిజిపేట

ఎన్నికల నియమావళిని మండలంలోని ప్రజలు, నాయకులు తూచా తప్పక పాటించాలని ఎన్నికల నోడల్ అధికారి రమేష్ నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయనతో పాటు సహాయ నోడల్ అధికారి బిజె జనార్ధన్ మాట్లాడారు. సాధారణ ఎన్నికలు నియమావళి ఆంక్షలు ఎన్నికల కమిషన్ విధించిందని, మండల ప్రజలు నాయకులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అనుసరిస్తే చర్యలు తప్పవనితన్నారు ముఖ్యంగా గ్రామాల్లో గృహాలపై మైక్ షర్టు పెట్టడం గానీ పార్టీలకు సంబంధించిన జెండాలను ఎగరవేయడం గాని చేయరాదని, సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకుని ప్రచారాలు నిర్వహించాలని రూ.50 వేలకు మించి నగదు ప్రయాణాల్లో తమ వద్ద ఉంచరాదని తెలిపారు. ఒకవేళ రూ.50వేలకు మించి నగదు ఉన్నట్లయితే సంబంధిత పత్రాలు చూపించాలని గ్రామ స్థాయిలో ఎలక్షన్ కోడ్ ఉందని వ్యతిరేకంగా ప్రవర్తించిన వ్యక్తులపైన గానీ, నాయకులు పైన గానీ ఎన్నికల నియమావళి ఉల్లంఘున కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటును నిబంధనలకు అనుగుణంగా వినియోగించుకోవాలని తెలిపారు ఎస్సై పాపారావు మాట్లాడుతూ మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై పోలీస్ పర్యవేక్షణ ప్రతిక్షణం ఉంటుందన్నారు. ముఖ్యంగా ఎన్నికల నియమాల దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ ప్రవర్తించాలని గ్రామాల్లో ఎటువంటి శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో క్రాష్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో ఎక్కడైనా బోర్లు పాడైపోతే తమకు సమాచారం ఇచ్చినట్టయితే క్రాష్ ప్రోగ్రాం ద్వారా మరమ్మతులు చేపడతామని సర్పంచ్ బి.గౌరీశంకర్రావు తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలో గత వారం రోజుల నుంచి మంచినీటి బోర్లను మరమ్మతులు చేస్తున్నామన్నారు. పంచాయతీలో ఎక్కడైనా మంచినీటి చేతి పంపులు, బోర్లు మరమ్మతులకు గురైనట్లయితే తమకు సమాచారం అందిస్తే మరమ్మతులు చేయిస్తామని ఆయన అన్నారు. అలాగే వేసవిని దృష్టిలో పెట్టుకొని మంచినీటి చేతి పంపులు, బోర్లను సక్రమంగా వాడుకొని నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆయన కోరారు.

వాలంటీర్లపై టిడిపి దిగజారుడు వ్యాఖ్యలు

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

నిరుపేదలకు అనేక సేవలు అందించిన వార్డు, గ్రామ వాలంటీర్లపై టిడిపి, జనసేన నాయకులు దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని డిప్యూటీ సీఎం రాజన్నదొర ఆరోపించారు. మంగళవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో, పట్టణాల్లో వార్డుల్లో లబ్దిదారులకు సంక్షేమ పథకాలు నేరుగా అందేలా చేయడానికి ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థను రూపకల్పన చేసిందని చెప్పారు. అలాంటి వాలంటీర్లను టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ తీవ్రమైన ఆరోపణలు చేశారని చెప్పారు. రాష్ట్రంలో అమ్మాయిలు తప్పిపోవడంలో వాలంటీర్ల పాత్ర ఉందని పవన్‌కల్యాణ్ గతంలో వ్యాఖ్యానించారని చెప్పారు. గోనెసంచులు మోసుకునే ఉద్యోగులు వాలంటీర్లని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారని చెప్పారు. మరో టిడిపి నాయకుడు సుధీర్ రెడ్డి వాలంటీర్లను తీవ్రవాదులతో పోల్చడం దారుణమన్నారు. ఇలాంటి పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేసిన నాయకులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఇసి అధికారులు చర్యలు తీసుకోవాలని రాజన్నదొర కోరారు.

పార్వతీపురంరూరల్: వాలంటీర్లను చూస్తే చంద్రబాబుతో పాటు టిడిపి నేతల గుండెల్లో రైళ్లు పరుగెడతాయని, కనుకనే జనసేనతో కలిసి వాలంటీర్లను కించపరిచే మాటలు మాట్లాడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాలంటీర్లు రూ.5వేలు గౌరవ వేతనంతో సమాజంలో నిస్వార్థంగా సేవ చేస్తున్నారని, అలాంటి వారిపై టిడిపి నాయకులు ఇలా మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. వాలంటీర్లపై అత్యంత నీచమైన వ్యాఖ్యలు చేసిన టిడిపి నేతలు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడంతో పాటు వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పట్టణ వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, సీతానగరం మండలం వైసిపి అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిది తప్పుడు ప్రచారం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని పలు గ్రామాల గిరిజనులు వైసిపిలో చేరుతున్నట్లు ఆ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారంతా ఆ పార్టీ వారేనని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కోలక అవినాష్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కేదాపురిపురం, డుమ్మంగి, పెద్దఖర్జి, ఎల్విన్‌పేట, లక్కగూడ, చాపరాయిబిన్నిడి తదితర గ్రామాలకు చెందిన పలువురు సిపిఎం కార్యకర్తలు వైసిపిలో చేరినట్లు కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలను ఖండించారు. వైసిపి కార్యకర్తలకే కండువాలు వేసి నాయకులు ఇలా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి సాంప్రదాయం మంచిది కాదని ఆయన దుయ్యబట్టారు.

వైసిపి తప్పుడు ప్రచారం మానుకోవాలి : జనసేన

మండలంలో జరిగిన వైసిపి చేరికల కార్యక్రమంలో జనసేన నాయకులు యమాల తారకేశ్వరారవు వైసిపిలో చేరారని సోషల్ మీడియాలోతప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని జనసేన కురుపాం సమన్వయకర్త కద్రక మల్లేష్ అన్నారు. మంగళవారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతూ తారకేశ్వరరావును నాలుగేళ్ల క్రితమే జనసేన నుంచి సస్పెండ్ చేశామన్నారు. జనసేన ఆవిర్భవం నుంచి ఆయనకు పార్టీలో ఎటువంటి బాధ్యతలు కానీ, ప్రాథమిక సభ్యత్వం కానీ లేదన్నారు. గత రెండేళ్లుగా ఆయన వైసిపిలోనే ఉంటున్నారని, మళ్లీ కొత్తగా చేరిక అని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు.

రేపు తోటపల్లి ఆలయ హుండీల లెక్కింపు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలం పరిధిలోని తోటపల్లిలో గల వెంకటేశ్వర, శ్రీకోదండరామస్వామి ఆలయాల హుండీలు లెక్కింపు ఈనెల 28న చేపట్ట నున్నామని దేవస్థానం కార్యనిర్వాహన అధికారి వి వి సూర్యనారాయణ తెలిపారు. ఈమేరకు మంగళవారం స్థానిక విలేకరు లతో మాట్లాడారు. తన పర్యవేక్షణలో గ్రామ పెద్దల సమక్షంలో ఈహుండీల లెక్కింపు చేపట్ట నున్నామన్నారు. ఈలెక్కింపులో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఉదయం 8 గంటలకు ముందు దేవస్థానం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఇఒ సూర్యనా రాయణ కోరారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

రానున్న సాధారణ ఎన్నికల్లో ఓటరు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజల అవసరాలను గుర్తురెగి వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకునే నీతి నిజాయితీ కలిగిన నేతలను ఎన్నుకునేందుకు నిర్భయంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపిడిఒ అకిబ్ జావెద్ సూచించారు. నా ఓటు నా హక్కు అనే పేరుతో మండలంలోని వెంకంపేటలో మంగళవారం అవగాహన కల్పించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటింగ్లో పాల్గొనాలన్నారు. రూరల్ ఎస్సై దినకర్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు కలిగిన వెంటనే పోలీసుల సహకారం తీసుకోవాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలని డిప్యూటీ తాసిల్దార్ వెంకటరమణ కోరారు.

పలగర పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పలగర ఎంపిపి పాఠశాలను ఎంఇఒ-1 సామల సింహాచలం మంగళవారం సందర్శించారు. విద్యార్థులను పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. టీచర్ల డైరీలను, లెస్సన్ ప్లాన్స్ తనిఖీ చేశారు. వర్క్ బుక్‌లను పరిశీలించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని, వర్క్ బుక్ కరెక్షన్స్ కూడా పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో తెలుగు, ఆంగ్ల పాఠ్యాంశాలను చదివించారు. విద్యార్థులకు లెర్న్ ఏ వర్డ్ పదాలను ప్రతి రోజు చదివించాలన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా సమయం కేటాయించి బోధించాలని టీచర్లకు సూచించారు. త్వరలో జరిగే వార్షిక తనిఖీ సమయానికి దస్త్రాలు అన్నీ సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలగొడబలో ఎమ్మెల్యే ప్రచారం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నియోజకవర్గం నుంచి రెండోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఎన్నికల మండలంలోని బాలగుడబ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మళ్లీ ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మువ్వల సత్యం నాయుడు, పండు, వర్రీ శ్రీనివాసరావు, పి తిరుపతి రావు, నాయకులు పాల్గొన్నారు.


బాలగొడబలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు